"జయమాల లేసిపోయింది"

ప్రేక్షకుల్లో ఎవరో అన్న మాటకు జనమంతా చప్పట్లు కొట్టేరు. చప్పట్లు కొడ్తూనే శివప్ప చేతులు చాచి జనం చుట్టూ తిరగసాగేడు. జనం ఎవరిదోవన వాళ్ళు వెళ్ళిపోసాగేరు.

✡ ✡ ✡

ఆ రోజు సంపాదనగా వచ్చిన చిల్లరనంతా లెక్కిస్తున్నాడు యాదయ్య.

"అయ్యా! రాముడుగోడు నాలుగురోజులు గడువిచ్చిండు. ఆపైన యిక నా కోసం ఆగడంట!" కళ్ళల్లో నీళ్ళు నింపుకొని అంది కోటీశ్వరి.

కోటీశ్వరి యాదయ్య కూతురు. ఎప్పటినుంచో రాముడిమీద మోజుపడింది. మనసిచ్చింది. మనువాడాలనుకొంది.

రామయ్య మంచివాడు. కష్టించి పని చేసే శక్తి వున్నవాడు. అల్లరి చిల్లర తిరుగుళ్ళు లేనివాడు. కుటుంబబాధ్యతలు తెల్సినవాడు.

"కోటిని సేసుకోటానికి నాకేం అబ్బెంతరం లేదు మామా, నాకిట్టమే, అయితే డబ్బుఅవసరముంది. నాకిప్పుడు డబ్బుంటేకానీ నా బాద్దెతలు తీరవు. బాద్దెతలు తీర్తేగాని నేను పెళ్ళి సేసుకోను. పిల్లతోబాటు డబ్బిత్తానని సాలా మంది వత్తన్నారు. నాకు అళ్ళిత్తాన్న డబ్బు నువ్విత్తే కొటినే సేసుకొంటా" తెగేసి వున్నమాట చెప్పాడు రాముడు.

యాదయ్యదగ్గర డబ్బు లేదు. కానీ రాముడిని చేసుకొంటే కోటి సుఖపడ్తుంది. కొంచెం గడువిస్తే ఆ మాత్రం డబ్బు తాను కూడ బెట్టలేడా?

రాముడు గడువిచ్చాడు. పొడిగిస్తూ పోతూనే వున్నాడు. యాదయ్య కష్టపడ్తూనే వున్నాడు. కానీ డబ్బు కూడుతేనా?

లెక్క పూర్తయింది. నాలుగురోజులు కాదు. నాలుగు నెలలైనా రాముడికివ్వాల్సినంత డబ్బు పోగు కాదు. అప్పటికీ తను మాడుతున్నాడు. కూతుర్ని మాడుస్తున్నాడు. కానీ ఆదాయం పెరగందే? పైసా...పైసా...ఎన్ని పైసాలవుతే వో రూపాయి...

ఛీఛీ...వెధవ పైసా బతుకు!

"మామా... కోతుల్ని ఆడించి పొట్టే నింపుకోలేవ్ మావా, కట్టం యిచ్చి కూతురుకు పెళ్ళేం సేత్తవ్? నీ కూతుర్ని నేను కొంటాను. అమ్మేయరాదూ?"

సింహాచలం గుర్తుకొచ్చాడు యాదయ్యకు.

సింహాచలం కూడా యాదయ్యలాగే కోతుల్ని ఆడించేవాడు మొదట్లో. ఆ తర్వాత ఎలుగు బంటి నొకదాన్ని పట్టేడు. అదీ అచ్చిరాక చిలక జోస్యాలు చెప్తున్నాడు చివరికి...

పోనీ సింహాచలానికి కోటినిచ్చి చేస్తే?

"ఆడొట్టి రగుడీ ఎదవయ్యా. రాముడు సెప్పిండు. బోకరు పని సేత్తాడంట! అంటే ఏటనుకున్నావ్? నీ దగ్గర నన్ను కొని మారు బేరానికి మరెవరికో అమ్మేత్తాడన్నమాట! మాయదారి ఎదవ. కిల్లాడి ఎదవ...థూ"

శివప్ప నిస్సహాయంగా యజమానివైపు చూచాడు. యాదయ్య గుండెలోనుంచి దుఃఖం ఎగదన్ను కొచ్చింది.

"నడవలేవా శివప్పా" రెండు చేతుల్తో కోతిని దగ్గరకి తీసుకున్నాడు యాదయ్య. "ఆల్లేదో పగలబొడుత్తారనుకొని నిన్ను కట్టబెట్టేరా? అసెకు బోయాను. ఆల్లను కొట్టలేక నీ కాళ్లు యిరగ్గొట్టేను. నా నడుం యిరగ్గొట్టుకున్నాను. అస్సలు నీదేం తప్పు లేదురా శివప్పా. నా కూటి కోసం నిన్నట్టా తయారు సేయటం నాది తప్పు. నన్ను సెమించరా. ఎల్దాంపద'

శివప్పను మెడ మీద కెక్కించుకొని మెల్లగా యిల్లు చేరేడు యాదయ్య. యింట్లో కోటీశ్వరి లేదు. వో మూల డోలక్, తప్పెట...కోతుల్ని ఆడించే పరికరాలు...

"నీ కూతురు నీ కోసం ఎదురు సూసి నిన్ననే ఎల్లిందయ్యా. రావుడు ఎవర్నో సేసుకొంటానని కబురు సేసిండంట. సింహాసెలం గాడితో ఎల్తన్నానని సెప్పమంది నీ కూతురు" పక్కయింటి అవ్వ చెప్పింది.

శివప్పను కిందికి దించి నీరసంగా నేల మీద కూలబడ్డాడు యాదయ్య. అతనికి ఏడవ్వాలనిపించింది. ఏడుపు రాలేదు. పెద్దగా నవ్వాలనిపించింది. నవ్వు రాలేదు.

"ఒరేయ్ శివప్పా! జయమాల లేసిపోయింది. కూటి కోసంనేనల్లిన కత అది. ఇప్పుడు కోటి లేసిపోయింది. నేనల్లినకతను యినీ యినీ... నా సేతకానితనాన్ని సూసీసూసీ...కోటి జయమాల కతను నిజం సేసింది. హహహ..." నవ్వుతూ అరిచేడు. అరుస్తూ నవ్వేడు. నవ్వినవ్వి ఏడ్డాడు. ఏడ్చి ఏడ్చి నీరసంతో శివప్పను కౌగలించుకొన్నాడు.

శివప్ప ఉలకలేదు, పలకలేదు.

మనిషి కోతిలో ఐక్యం అయ్యాడు.

దిగాలు పడి చూస్తున్న మిగతా రెండు కోతుల మెళ్ళలోని తాళ్ళ అవతలి కొసలు యాదయ్య గుప్పిటలోనుంచి విడవడ్డాయి. స్వేచ్ఛ...విముక్తి.

కానీ...

ఆ రెండు కోతులూ ఎటు పోవాలో, ఏం చేయాలో తోచనట్లు అలా నిలబడిపోయాయి.

ఉన్నట్లుండి డోలక్ శబ్దం విన్పించింది.

తాషా-తప్పిట-మోగింది.

తోషి బజానా...బాజా బజానా...మియా...తోషీ బజానా...

పాడటానికి మనిషేడీ?

ఆంధ్రభూమి వార పత్రిక 23-2-84